

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ బొందుగుడ గ్రామంలో సర్పంచ్ పూజారి కొములు ఆధ్వర్యంలో ప్రపంచ హ్యూమన్ రైట్స్ సంఘం ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఆర్.బాలారాజు, మదు బాబు మాట్లాడుతూ, రాజ్యాంగం లో కల్పించిన మానవ హక్కుల పై గిరిజనులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర ఆ సంఘ నాయకులు క్రిష్ణ గౌడ్, రంజిత్ గౌడ్, బురిడీ విక్రమ్ దేవ్, సన్యాసి నాయుడు, సరీప్ నిసమ్మ, కే సునిల్ కుమార్, ఎ.వైకుంఠం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్, సంస్థ సభ్యులు

గిరిజనుల భూముల జోలికొస్తే తరిమికొడతాం

▶▶ సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: తాతల కాలం నుండి సాగు చేస్తున్న భూములను మైదాన ప్రాంతాలకు చెందిన భూస్వాములు దౌర్జన్యంగా లాక్కొంటే చూస్తూ ఊరుకునేది లేదని, గిరిజన సాంప్రదాయ ఆయుధాలు లతో తరిమి కొడతామని సిపిఎం జెడ్పిటిసి దీసరి .గంగరాజు హెచ్చరించారు. నాన్ షెడ్యూల్ కొంపల్లి పంచాయతీ బూరిగ, చిన్నకోనెల గ్రామాలలో శనివారం జెడ్పిటిసితో పాటు రెవిన్యూ బృందం సందర్శించింది. అనంతరం భూ సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మైదాన ప్రాంతాలకు చెందిన భూస్వాములు తమ భూములను లాక్కున్నారని, వాటిని తమకే తిరిగి అప్పజెప్పాలని వేడుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, సుమారు 72 మంది రైతులు 120 ఎకరాల పైగా భూమిలో తాత ముత్తాతల కాలం నుండి వ్యవసాయ పంటలు పండించుకుంటూ జీవనాధారం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ భూములపై కన్ను వేసిన విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల మైదాన ప్రాంతాలకు చెందిన భూ స్వాములు భూదందాకు పాల్పడుతున్నారని, దీనిపై పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. 10 నెల 6న రెవిన్యూ బృందంతో సందర్శించి రైతుల సమక్షంలో సర్వే చేపట్టగా బూరిగ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1 నుండి 2 వరకు బూరిగ గ్రామంలో ఉన్న 93 ఎకరాల 67 సెంట్ల భూమిలో 30 ఎకరాల 19 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా రుజువైందని తెలిపారు. 63 ఎకరాల 48 సెంట్ల భూమిని భూ స్వాములైన మళ్లీ రెడ్డి .దొరబాబు, కందుల జగదీష్ పేర్లతో నమోదుపై రైతులు కోరగా రెవిన్యూ అధికారులు తిరిగి రైతులకు నోటీసులు జారీ చేశారన్నారు. రైతులు ఇదేమిటని మనో శోభకు గుర్రై చింత చెట్టు వద్ద మెడకు ఉరితాడు వేసుకొని తమ భూములు తమకే కల్పించాలని వినూత్న రీతిలో నిరసన చేపట్టారని తెలపారు. భూ స్వాములకు కొమ్ము కాస్తున్న రెవిన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, రైతుల భూమి వారికి దక్కే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఈ భూములపై అనేక ఫిర్యాదులు వెళ్లడంతో సబ్ కలెక్టర్ కోర్టులో వివాదం నడుస్తుందని, అయినా భూ స్వాములకు కొమ్ముకాస్తూ కాసులకు కక్కుర్తి పడి కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటపార్తి. చిరంజీవి, ఉప సర్పంచ్ సింహాద్రి, సిపిఎం మండల నాయకులు జె. సుబ్బారావు, ఎం.కృష్ణ, వార్డు మెంబర్లు సింహాచలం, .అప్పలరాజు, పెంటయ్య పాల్గొన్నారు



గిరిజనులతో కలిసి భూములను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు



తాగునీరు పైపులైన్ పనులకు భూమి పూజ చేసిన ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ప్రతి ఇంటికీ తాగునీరు

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

రేఖపల్లి గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు పైపులైన్లు వేస్తున్నట్లు ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి తెలిపారు. రేఖపల్లి పంచాయతీ పరిధి ఎంపిడిఓ ఆఫీసు వద్ద సుమారు 700 మీరటర్ల తాగునీటి పైపు లైన్ ఏర్పాటుకు వారు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు నల్లారపు ప్రకాష్ రావు, సిరపు తాతబాబు, రెడ్డి హజరత్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ సాయిరాం ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తరుణ్, సచివాలయం సెక్రటరీ శివప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

పరామర్శకు వెళుతున్న గిరిజన సంఘం నేత అరెస్టు

ప్రజాశక్తి జి.మాడుగుల : పాడేరు మండలం డోక్లూరు పాఠశాలలో చదువుతున్న జి.మాడుగుల మండలంలోని పీజీ మాడుగుల గ్రామంలో విద్యార్థి మృతి చెందాడు. అనారోగ్యంతో విద్యార్థి బాధపడుతున్నా ఉపాధ్యాయులు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ఊరికి పంపించడంతో తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. విద్యార్థి మృతి చెందటంతో గిరిజన సంఘం మండల కార్యదర్శి జగ్గం దొర, దినబంధు శనివారం కుటుంబాన్ని పరామర్శించడానికి వెళుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. గిరిజన సంఘం నాయకులు ఎక్కడ నిజాలు బయటపెడతారనే భయంతో ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని, దీనిపై గిరిజన సంఘం నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరెస్ట్ చేసిన గిరిజన సంఘం మండల కార్యదర్శి దీనబందును వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థి సీదారి సూరిబాబు మరణానికి కారణమైన సిబ్బందిని అరెస్టు చేయకుండా గిరిజన సంఘం నాయకుల్ని అరెస్ట్ చేయడం ఏమిటన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, మీడియాకు అనుమతి ఇవ్వక పోవడంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం సూరిబాబు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా, కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల మరణాలపై విచారణ జరపాలి

ఎపి గిరిజన సంఘం నాయకులు అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అనారోగ్య కారణాలతో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని ఏపీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు తరుచుగా మృతి చెందడం పై ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం విచారకరమన్నారు.పాడేరు మండలం డోకులూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్య నభ్యసిస్తున్న విద్యార్థి సిదరి సూరిబాబు అనారోగ్యంతో పిజి మాడుగులో ఇంటి వద్ద మరణించాడన్నారు. అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న గిరిజన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించడానికి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. ప్రాథమిక వైద్యం అందించే ప్రక్రియ కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. గత 20 రోజుల్లో పాడేరు మండలంలో పలు పాఠశాలల్లో విద్యానభ్యసించడానికి వచ్చిన ముగ్గురు గిరిజన విద్యార్థులు మృతి చెందిన ప్రభుత్వంలో కదలిక లే దన్నారు. ఇది ప్రభుత్వ హత్య అని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను విద్యార్థి, గిరిజన సంఘాలు, సంస్థలు మీడియా ప్రతినిధులు ప్రవేశాన్ని నిషేధించి ఆశ్రమ పాఠశాలలను జైలు లాగా మార్చారన్నారు. పాఠశాల లోపల గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం, అనారోగ్య సమస్యలు బాహ్య ప్రపంచానికి తెలియ కుండా గిరిజన సంక్షేమ పాఠశాలలో నియంతృత్వ పరిపాలనను రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తుందన్నారు.

అక్రమ అరెస్టు దారుణం

పాడేరు: జి.మాడుగుల్లో మతి చెందిన పదో తరగతి విద్యార్థి సీదరి సూరి బాబు కుటుంబానికి న్యాయం చేయాలని, సమగ్ర విచారణ నిర్వహించాలని అప్పలనర్స డిమాండ్ చేశారు. కుటుంబానికి అండగా నిలబడిన గిరిజన సంఘం జిల్లా నాయకుడు జగ్గందొర దీనబందును జి.మాడుగుల పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆయన ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న, ఎండగడుతున్న గిరిజన సంఘం నాయకుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో గిరిజన విద్యార్థుల తరపున ప్రశ్నించడాన్ని నేరంగా పరిగణించడం, అక్రమంగా అరెస్ట్ చేయడం, నిర్బంధించడం మానవ హక్కుల ఉల్లంఘన గానే భావిస్తున్నామన్నారు. ప్రభుత్వ వైఖరిని ఖండించాలని గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి మహిళ యువజన సంఘాలకు గిరిజన సంఘం పిలుపు నిస్తోందని చెప్పారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, వరద బాధితులు

వరద నష్ట పరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-కూనవరం

వరదల్లో మునిగి నష్టపోయిన ఇళ్లకు నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అందించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కూనవరం సచివాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. అనంతరం పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ జులై, ఆగష్టు నెలలో వచ్చిన వరదలకు నష్టపోయిన వరద బాధితులకు ఇంటికి రూ.10వేలు ఇస్తామన్న ముఖ్యమంత్రి, నేటికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆస్తి నష్టాన్ని మిగిల్చిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందకపోతే సిపిఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, యడ్ల వెంకన్న బాబు, జక్కుల వీరబాబు, షణ్ముఖ రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మట్టి షెడ్డులోనే చదువుతున్న విద్యార్థులు

మట్టి షెడ్డులోనే పాఠశాల!

ప్రజాశక్తి-పెదబయలు రూరల్ : మండలానికి చెందిన మారుమూల కొరవంగి పంచాయతీ బొడ్డగొంది గ్రామంలో ప్రజలు విద్య, వైద్యానికి నోచుకోలేదు. గత ఏడాది ప్రభుత్వం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మంజూరు చేసింది. దీంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా ఎంతో పొంగిపోయారు. పాఠశాలకు భవనం లేక కొంతకాలం టార్పన్ కవర్ నీడలో పాఠశాల కొనసాగింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటింటా చందాలు వేసుకుని సిమెంట్, రేకులు తెచ్చుకొని పాఠశాల ఏకపాధ్యాయులు రాంబాబు చొరవతో మట్టితో షెడ్డును శ్రమదానంతో కట్టారు. పాఠశాలలో 25 మంది విద్యను అభ్యసిస్తున్నారని, ఈ సమస్యపై మండల స్థాయి అధికారులు స్పందించి భవనం మంజూరు చేయాలని పలు సార్లు కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాడు నేడు కార్యక్రమంలో భాగంగా భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు శంకర్, సురేష్ కుమార్, బాలకృష్ణ, సుందరరావు మత్స్య రాజు, పురుషోత్తం నారాయణ, ప్రసాద్ కోరారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

పిఒ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బయట వ్యక్తులు ప్రవేశించకుండా ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే జారీ చేసిన ఆదేశాలు పక్కాగా అమలు చేయాలని ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలకృష్ణ అన్నారు.ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదేశాలను పక్కదారి పట్టిస్తే పాఠశాల యజమాన్యంపై చర్యలు తప్పవని ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఓల్డా, రాప, రంగశీల సంతారి గ్రామ సచివాలయంలను మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను తనిఖీ చేసారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మూమెంట్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని చెప్పారు. గిరిజన సమస్యలు సచివాలయం పరిధిలో పరిష్కరించాలని అదేశించారు. అనంతరం పెదగరువుగిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల విద్యా బోధనలపై విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి చెప్పారు. స్టాక్ రూమ్ పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు కొండమ్మ ఉన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాశక్తి ఎటపాక

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఎదుట ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. ఎడపాక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు ఎస్పి సతీష్ కుమార్ వెల్లడించారు. ఎస్పి కథనం ప్రకారం... సుకుమా జిల్లా కుంట మండలం బెజ్జిగరామ గ్రామానికి చెందిన కొవ్వాసి పొజ్జె 2005లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలుగా చేరింది. 2022లో పిఎల్‌జిఏ డిప్యూటీ కమాండర్‌గా నియమించబడ్డారు. ఈమె జీరంగూడ శివారులో మావోయిస్టులకు భద్రతా బలవగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో పాల్గొన్నారు. ఈ ఘటనలో 22 మంది సిఆర్పిఎఫ్ జవాన్లు మరణించారు. 2022 సంవత్సరంలో ఎల్లమగుండ, పోటకపల్లి సిఆర్పిఎఫ్ క్యాంప్‌పై దాడి ఘటనలో పాల్గొన్నారు. చతిస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా పడి మీరు గ్రామానికి చెందిన మడివి శంకర్ 2013లో మావోయిస్టు పార్టీలో మలేషియా సభ్యుడిగా చేరాడు. 9 సంవత్సరాలు పాటు మావోయిస్టు పార్టీలో పని చేశాడు. ఈ ఏడాది మార్చి 21న మినప మరి చెంత గొప్ప గ్రామాల మధ్య మావోయిస్టులకు భద్రత బలగాలకు మధ్య జరిగిన ఎదుర్కొల్పుల్లో పాల్గొన్నారు. ఈ గట్లలో 17 మంది భద్రత బలగాలు, ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈరగూడ గ్రామ సేవలలో మావోయిస్టులకు భద్రతలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల ఘటనలో పాల్గొనగా, ఈ ఘటనలో 22 మంది భద్రతా బలగాలు మరణించారు. మావోయిస్టు పార్టీ యొక్క సిద్ధాంతాలకు విసిగిపోయి, పార్టీలో ఆదివాసీయేతర నాయకుల నుండి వివక్ష, పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గడం, పోలీసులు గస్తీ పెరగడం, పెరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వంటి కారణాలతో మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిశారని ఎస్పీ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 141వ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్, రంపచోడవరం ఓఎస్‌డి జి కృష్ణ కాంత్, చింతూరు ఏఎస్‌పి కేవీ మహేశ్వర్ రెడ్డి, ఎటపాక, చింతూరు సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్, చిత్రంలో లొంగిపోయిన మావోయిస్టులు

ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు

ఏడాదికాలంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను తక్షణం విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. శనివారం చదలవాడ గ్రామ సచివాలయం పరిధిలో కలుముల మల్లేష్ జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పని చేసిన 15 రోజులలోనే కూలీ డబ్బులు ఇవ్వాలని చట్టం చెబుతుంటే, ఏడాది కాలంగా బిల్లుల పెండింగ్ పేరుతో లక్షల రూపాయలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సచివాలయం పరిధిలో కనీస సౌకర్యాలైన వీధిలైట్లు, మంచినీళ్ళ, రోడ్లు అనేక సమస్యలు, పేరుకుని పోయి ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. సచివాలయం పరిధిలో లక్కవరం నుండి కాన్సలురుకు రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. మంచినీటి స్కీములు నిర్మాణంలో ఉన్నాయని, ప్రజలకు కనీసం చుక్క నీరు అందించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, మడకం చిన్నయ్య, కలుముల ముత్తయ్య, వేముల లక్ష్మయ్య, సవలం భద్రయ్య, ధర్మల తమ్మయ్య, మీడియం భద్రయ్య, కలముల రామారావు, సత్తిబాబు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీరం సురేష్



శాంతి స్థూపాన్ని చూస్తున్న గిరిజనులు

సప్పర్ల వారపు సంతలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం సప్పర్ల వారపు సంతలో పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పిఎల్‌జిఏ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో జీకే వీధి సిఐ అశోక్ కుమార్, 234 సిఆర్పిఎఫ్ బెటాలియన్ బీరేంద్ర కుమార్, స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో వారపు సంతలో అణువణువునా తనిఖీలు చేపట్టారు. అనుమానితుల్ని ప్రశ్నించారు. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులు వివరాలు సేకరించి విడిచిపెట్టారు. మావోయిస్టుల కదిలికలపై నిఘ పెట్టారు. మావోయిస్టు ఇన్ఫార్మర్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.


సప్పర్లలో శాంతి స్థూపాలు

జీకే వీధి మండలం సప్పర్లలో శనివారం మావోయిస్టుల చేతులో హత్యకు గురైన గిరిజనులు పేరిట శాంతి స్థూపాలు శనివారం వెలిశాయి. మావోయిస్టు పిఎల్‌జిఎ వారోత్సవాలు నేపథ్యంలో శనివారం సప్పర్లలో వారపు సంత కావడంతో సంతకు వచ్చిన గిరిజనులు చూసే విధంగా వీటిని ఏర్పాటు చేశారు. మావోయిస్టులు చేతిలో అసువులు బాసిన గిరిజన సోదరులకు జోహార్లు అంటూ వాటిపై పేర్కొన్నారు.

ఆయాకు సత్కారం

ప్రజాశక్తి-కొయ్యూరు

ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని మంప పంచాయితీ గంగవరం గ్రామానికి చెందిన అంగన్ వాడీ ఆయా జర్తా సత్యవతిని ఎంపీపీ బడుగు రమేష్ తదితరులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జర్తా సత్యవతి అంగాన్ వాడీ ఆయాగా 35 సవంత్సరాలుగా గ్రామానికి అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇంగువ త్రినాథ మూర్తి పడాల్, అంగన్వాడీ టీచర్ ఆగూరి అచ్చియ్యమ్మ, వాసు, కొండబాబు, సీపీఎం నాయకులు యామల అప్పలనాయుడు, ఎస్.సూరిబాబు, పంచాయితీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ ఆయా సత్యవతిని సత్కరిస్తున్న ఎంపిపి రమేష్ తదితరులు

వైటిసి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని యువజన శిక్షణ కేంద్రం(వైటిసి)లో పని చేస్తున్న కార్మికులకు11 నెలల వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులతో పూట గడవక ఆందోళన చెందుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు.శనివారం చింతపల్లి వైటీసిలో పని చేస్తున్న కార్మికులు సిఐటియు మండల కార్యదర్శి వేములపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కమిటీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, చింతపల్లి, అరుకు, పెదబయలు, వేపగుంట ప్రాంతాలలో వేల కోట్ల ఖర్చు పెట్టి యూత్ ట్రైనింగ్ సెంటర్లు పెట్టడం జరిగిందని తెలిపారు. ఆ ట్రైనింగ్ సెంటర్ల సంరక్షణ కోసం ఒక కార్మికుడికి నెలకు రూ.10000 జీతం ఇస్తూ వర్కర్లుగా నియమించుకున్నారని తెలిపారు. 4 వైటీసీలలో 26 మంది పని చేస్తున్నారని, బడ్జెట్ లేదనే సాకుతో ఐటిడిఏ పిఓ, కష్టపడి పని చేసిన కార్మికులకు 11 నెలలు అవుతున్నా బకాయి జీతాలు ఇవ్వలేదని మండిపడ్డారు.'మీకు జీతాలు ఎప్పుడు ఇస్తే అప్పుడు పనిలోకి రావాలని అంతవరకు రావద్దని' పిఓ చెప్పడం అర్థరహితమన్నారు. పనిచేసిన కాలానికి 11 నెలల బకాయి పడ్డ జీతాలు తక్షణమే ఇవ్వాలని చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. లేదంటే ఐటీడీఏ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైటిసి కార్మికులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: పాడేరు కేంద్రంగా ఈ నెల 20, 21 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా సిఐటియు ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు.అరకువేలి గిరిజన భవన్ లో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లా సీఐటీయు ప్రథమ మహసభ పాడేరు కేంద్రంగా జరగనుందని, కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్వాడి, ఆశ, మిడ్ డే మిల్స్, వివోఏ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. డైలీ వేజ్, క్యాజువల్ కార్మికులకు పని భద్రత ఇవ్వాలని తదితర వాటిపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, రైల్వే, ఎల్ఐసి ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఉపాధి హామీ కింద 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పని భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ వైద్య సదుపాయాలు అందుబాటులో తీసుకురావాలని సిఐటియు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అరకు వేలి మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ప్రభుదాస్, జి భగత్రం, మండల నాయకులు మగ్గన్న, సింహాద్రి, గోకుల్, అంజలి, చిన్నమ్మి, తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పర్యాటక అనుమతులు ఇవ్వండి

చాపరాయి టెండర్ పాటదారుడు భాస్కరరావు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: పారిశుధ్యం కారణంతో చాపరాయి జలపాతం వద్దకు పర్యాటకులకు అనుమతులు ఇవ్వకుండా ప్రవేశ టికెట్ల రుసుము వసూలు నిలిపి వేయడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని చాపరాయి టెండర్ పాటదారుడు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, టెండర్ నిధులతో అధికారులు చాపరాయి అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. టెండర్ పాట నిర్వాహకులకే పారిశుధ్య పనులతో పాటు ఇతర అభివృ పనులు చేయాలని అధికారులు చెప్పడం అన్యాయమన్నారు. ప్రస్తుతం హైవే రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో పర్యాటకులు కూడా తక్కువగా సందర్శిస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, దీనికి తోడు పారిశుధ్యం కారణంతో ఉన్నతాధికారులు గత మూడు రోజుల నుంచి చాపరాయి తెరవకుండా మూసివేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చాపరాయి నిర్వహణలో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



మంజూరు పత్రం చూపుతున్న పాటదారుడు

రిపోర్టర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని లివిటీ గ్రామానికి చెందిన రిపోర్టర్ తల్లి చప్పాలి చిట్టమ్మ గత వారం రోజులుగా అనారోగ్యం బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఏపీ టీఆర్ఏ మీడియా మిత్రులు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాటం



ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు ప్రజా సమస్యల పరిష్కారం కోసం టిడిపి పోరాటం చేస్తుందని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాంగి శాస్త్రిబాబు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం టిడిపి నాయకులు సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన 'ఇదేం ఖర్మ' కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా శాస్త్రిబాబు మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలకంఠం పాత్రో, రామదాసు, సుబ్రహ్మణ్యం, అనిల్, భగీరథి, మత్స్యరాజు, రామదాసు, గోపాల్, అర్జున్, లంబుధర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి నారాయణ స్వామి



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సమానత్వం, సమాన అవకాశాల కల్పన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆకాంక్షని, ఆ మహనీయుని ఆశయ సాధనకు కృషి చేస్తామని కేంద్ర సామాజికన్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణ స్వామి అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో శనివారం 'అంబేద్కర్ ఆలోచనలు డిజిటల్ ఇండియాతో సాకారం చేసిన మోడీ' అంశంపై ఎయు అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహిస్తున్న ఒకరోజు సదస్సులో వర్చువల్ విధానంలో పాల్గొని మాట్లాడారు. నేడు డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సాగరమాల వంటి పథకాలు ప్రజలందరినీ అభివృద్ధిలో భాగం చేస్తున్నాయన్నారు. గ్రామాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడం, ఇంటర్నెట్ సేవలు అందుబాటులో తీసుకురావడం, తద్వారా ప్రజలకు అవకాశాలు పెంచుతూ, సామాజిక న్యాయం సాకారం చేస్తున్నామన్నారు. ఎయు అంబేద్కర్ చైర్‌తో గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలకు సైతం సేవలు అందించాలని సూచించారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డిలు గ్రాస్ హ్యాపీనెస్ ఇండెక్స్ పెంపుదలకూ పనిచేస్తున్నారన్నారు. యువత డిజిటల్ ఇండియా ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విశిష్ట అతిథి ఎస్‌టిపిసి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాత మాట్లాడుతూ ప్రతీ భారతీయుడు డిజిటల్ ఇండియా ప్రాధాన్యత తెలుసుకోవాలన్నారు. డిజిటల్ ఇండియా ఫలాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేసే దిశగా ఎయు అంబేద్కర్ చైర్ చేస్తున్న కృషిని అభినందించారు. ఎయు అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎస్.కిషోర్ బాబు, కృష్ణ మంజరి పవార్, టి.శోభశ్రీ, హెచ్. పురుషోత్తం, టి.షారోన్‌రాజు, కె.బసవయ్య, వి.సిద్దయ్య, కె.వెంకటరావు, వజీర్ మహ్మద్, సిఎన్‌వి సత్యనారాయణ రెడ్డి, ఎన్ఏడి పాల్ పాల్గొన్నారు.

9 నుంచి తానా ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ పోటీలు



వికలాంగుల క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర్యంలో గీతం వేదికగా ఈనెల 9 నుంచి 13 వతేదీ వరకు వికలాంగులకు వీల్‌ఛైర్ సౌత్ ఇండియా క్రికెట్ కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తానా ఫౌండేషన్ క్రీడా విభాగం కోఆర్డినేటర్ శశాంక్ యార్లగడ్డ తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ శనివారం ఆవిష్కరించారు. వికలాంగుల్లో క్రీడస్ఫూర్తిని నింపడానికి ఈతరహ పోటీలు ఉపకరిస్తాయని అభినందించారు. కాగా ఆంధ్రప్రదేశ్ వీల్‌ఛైర్ అండ్ డిజెబిలిటీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్ బెంజిమన్, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు రుక్మాకరరావు, కార్యదర్శి రామన్ సుబ్బారావు మాట్లాడుతూ గీతం క్రికెట్ స్టేడియంలో జరిగే పోటీలకు దక్షిణ భారతదేశంలోని కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా వికలాంగ క్రికెటర్లు హజరవుతున్నారని వెల్లడించారు. బిసిసిఐకి అనుబంధంగా గల భారత వీల్‌ఛైర్ క్రికెట్ అసోసియేషన్ తదితర సంస్థల సహకారంతో తొలిసారిగా విశాఖలో ఈ క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తానా అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి, వ్యవస్థాపక ఛైర్మన్ యార్లగడ్డ వెంకట రమణ, ట్రస్టీ రవి సామినేని, గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్ కార్తీక్ పాల్గొన్నారు.

7న విజయవాడలో 'వైసిపి జయహో బిసి'

ప్రజాశక్తి -సీతమ్మధార : ఈనెల 7న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే 'వైసిపి జయహో బీసీ, వెనుకబడిన కులాలే వెన్నెముక' సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు ఆవిష్కరించారు.

1కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు ,వికెపిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, బిసి కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, యాత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పిల్లి సుజాత, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

స్థానిక మండల ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఐఈఆర్‌టి గొర్లె మంజు భార్గవి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గొర్లె బాలాజీ బాబు, స్థానిక సర్పంచ్ కొండ జాకబ్ మాట్లాడుతూ వికలాంగులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, మనో ధైర్యంగా ఉండాలని, ఆత్మ విశ్వాసం పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి మాజీ ఎంపిటీసీ గొర్లె అనిల్ ప్రసాద్(బాబి), ఏఎంసి డైరెక్టర్ దూడ స్మిత్, వార్డ్ మెంబెర్ లక్కొండ సతీష్ కుమార్, ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు దొర, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్న విష్ణు దొర, యూత్ నాయకులు గొర్లె కరుణకర్, బోరాగా సుదర్శన్ పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక భవిత కేంద్రంలో ఎంఇఒ వై.మల్లేశ్వరరావు అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.దొరబాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆరోక్యరాజ్, సూర్యచంద్ర, వెలిగు సిసి తీగల చిన్నరావు, ఉపాధ్యాయులు కె.చిన్నారావు, గ్రామ పెద్దలు సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి

ప్రజాశక్తి - అడ్డతీగల : వైసిపి పాలనలోనే అభివృద్ధి జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని మిట్లపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఆమె నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కారం చెయ్యాలని అధికారుల్ని ఆదేశించారు. రానున్న కాలంలో ఈ సంక్షేమ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల ఎంపీపీ బి రాఘవ, వైస్ ఎంపీపీ బాలసుబ్రమణ్యం, బొడ్లంక సర్పంచ్ బోనం రాఘవ, వేటమామిడి సర్పంచ్ మడకం రాజులమ్మ, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి జంక్షన్ వద్ద ఐద్వా మండల అధ్యక్షుల, ఎంపీపీ కారం లక్ష్మి జెండా మహిళా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 4న విఆర్.పురం మండలం సున్నవారి గూడెంలో జరిగే మహిళాసంఘం ప్రథమ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఐద్వా పని చేస్తుందని చెప్పారు. ఆర్థిక, రాజకీయ అణిచివేత నుండి విముక్తికై మహిళలకు తోడ్పాటుగా నీడగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, నాయకులు నాళ్లరపు భారతి, పాయం లక్ష్మి, కట్టం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి లక్ష్మి

శత్రు దుర్భేద్యం.. తూర్పునౌకాదళం

50 యుద్ధ నౌకలు, 65 ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 4 సబ్‌మెరైన్లు నే(వీ)డేకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నింగి, నేల, నీరు.. ఎక్కడైనా శత్రుమూకలను మట్టుపెట్టగలిగే వ్యూహాత్మక లక్ష్యాలతో తూర్పు నౌకాదళం ముందుకు సాగుతోంది. ప్రతి ఏటా డిసెంబరు 4న నేవీ డే జరుపుకోవడం ఆనవాయితీ కాగా దేశంలోని నౌకాదళాల్లో అత్యంత వ్యూహాత్మకమైన తూర్పు నౌకాదళం (విశాఖ) నేవీ డే వేడుకకు ప్రధాన వేదిక కావడం గర్వించదగ్గ విషయం. గడచిన రెండేళ్లు నేవీ డేను కోవిడ్ కారణంగా నిర్వహించలేదు. దీంతో అత్యధిక మంది ప్రజలు నేవీ డే ఉత్సవాలను తిలకించేందుకు ఆదివారం సాయంత్రం సాగరతీరంలో బారులు తీరనున్నారు. విశాఖ సాగర తీరంలో యుద్ధవాతావరణం అలముకోనుంది. ఈ నెల 2న రిహార్సల్స్‌ను ఇదే స్థాయిలో నావికాదళం నిర్వహించగా అధిక సంఖ్యలో జనం హాజరయ్యారు. తన సారథ్యంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), ఆ తర్వాత ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ (పిఎఫ్ఆర్), మిలాన్ - 2022 నిర్వహించి 39 దేశాలతో స్నేహపూర్వక వాతావరణాన్ని తూర్పు నౌకాదళం నిర్మించుకుంది. 2021లో పిఎఫ్ఆర్, 2022లో మిలాన్ నిర్వహణ ఈస్టర్న్ నేవల్ కమాండ్‌లో ఘనంగా జరిగాయి.



రిహార్సల్స్‌లో దూసుకుపోతున్న నేవీ నౌకలు

ప్రధానమైన వేడుక విశాఖ నౌకాదళంలోనే..

చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ (సిఎన్‌సి) పాల్గొనే వేడుక దేశంలోని ఏ కమాండ్‌లో జరిగితే అదే ప్రధానమైన నేవీ డేగా పరిగణించడం ఆనవాయితీ. దేశ రక్షణ కవచాలైన త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్).. ఇలా ప్రతి దళం ఏటా ఈ వేడుక నిర్వహించుకుంటోంది. నావికాదళాలకు తూర్పు మనకు ఉన్నట్లుగానే వెస్ట్ (ముంబయి), సౌత్ (కొచ్చి), అండమాన్ నేవల్ కమాండ్స్ ఉన్నాయి. నేవీ డే అన్నిచోట్లా జరిగినా ప్రధాన వేడుకకు వేదిక విశాఖే. ఈ ఆదివారం విశాఖలో ఇండియన్ నేవీ డే నిర్వహణకు భారీగా తూర్పునౌకాదళం, విశాఖ జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నావికాదళ విన్యాసాలు వీక్షకులను ఆదివారం సాయంత్రం అబ్బురపరచనున్నాయి. పటిష్టమైన బందోబస్తుతో ఘనంగా ఈ వేడుకను నౌకాదళం నిర్వహించనుంది. ఈ వేడుక సందర్భంగా శనివారం తూర్పునౌకాదళంలోని జలాశ్వ నౌకపై ఈస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ బిశ్వజిత్ దాస్ గుప్తా మాట్లాడుతూ మనకు అత్యంత బలీయమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని తెలిపారు. చిన్నా, పెద్దా యుద్ధనౌకలు అన్నీ కలిపి 50, యుద్ధవిమానాలు 65, జలాంతర్గాములు 4 (అరిహంత్ వంటి శక్తివంతమైన సబ్‌మెరైన్) కూడా ఉందని వెల్లడించారు. ఐఎన్ఎస్ విక్రాంత్ కొచ్చిలో ప్రస్తుతం ఉందని, త్వరలో తూర్పునౌకాదళానికి రానుందని తెలిపారు. తూర్పునౌకాదళం అనేక సవాళ్లను అధిగమిస్తూ శత్రు దుర్భేధ్యమైన రక్షణ దళంగా విస్తరిస్తూ వస్తోంది. యుద్ధ నౌకలు 40లో 38 మన దేశంలో స్వయం శక్తితో నిర్మించడం విశేషం. దేశంలోని ఇతర షిప్‌యార్డుల్లో మరో 15 నౌకలు తయారీకి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ఎంఎస్‌ఎంఇల విస్తరణ

తూర్పునౌకాదళం విస్తరణలో భాగంగా వివిధ రకాల పరికరాల తయారీలో ఎంఎస్‌ఎంఇల పాత్ర ఏటా పెరుగుతోంది. దీని వల్ల వేల సంఖ్యలో ఉపాధి లభిస్తోంది. 80 ఎంఎస్‌ఎంఇలు నేవీ పరికరాల ఉత్పత్తిలో ఏటా రూ.120 కోట్ల పనులను నిర్వహిస్తున్నాయి. ఐఎన్ఎస్ కళింగ, ఎన్ఎడి, ఐఎన్ఎస్ డేగా వంటి చోట్ల పనుల్లో ఎంఎస్‌ఎంఇలు నిమగ్నమవుతున్నాయి. ఇందుకుగానూ ఏటా రక్షణ అవసరాల సెమినార్లు, వర్క్‌షాప్‌ల నిర్వహణ పెద్ద ఎత్తున సాగుతోంది. ఆదివారం జరుగనున్న నేవీ డే వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సహా అధికార యంత్రాంగం, జివిఎంసి, రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున సహకారం అందించారని ఈస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ బిశ్వజిత్ దాస్ గుప్తా చెబుతూ.. అందరికీ శనివారం సాయంత్రం అభినందనలు తెలిపారు.

గంటందొర, మల్లుదొర విగ్రహాల ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-కొయ్యూరు

అల్లూరి సీతారామరాజు పట్టుబడిన మంప గ్రామంలోని అల్లూరి స్మారక మందిరంలో స్వాతంత్ర్య సమరయోధులు, అల్లూరి అనుచరులు గంటం దొర, మల్లు దొర విగ్రహాలు ఏర్పాటు చేస్తామని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. మంప అల్లూరి స్మారక మందిరాన్ని అభివృద్ధి చేయడానికి తమ సంఘం కృషి చేస్తుందని చెప్పారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో 100 పేద గిరిజన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, సహాయ కార్యదర్శి మాకాడ బూరుగులయ్య, రేవళ్ళ పంచాయితీ సర్పంచ్ గడుతూరి వెంకటలక్ష్మి, అనిమిరెడ్డి అప్పలకొండ, గొల్లపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు



మహాసభ వేదికపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సందడిగా సాగరతీర కళంజియ మహాసభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన 18 సంవత్సరాలుగా నడుస్తున్న సాగర తీర, విశాఖ మత్స్యకారుల కళంజియ సమాఖ్య ఆరో మహాసభ శనివారం ఎఎస్.రాజా కాలేజ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగింది. అప్పుఘర్ లుంబిని పార్క్ నుంచి ఎఎస్.రాజా గ్రౌండ్ వరకు ర్యాలీ చేపట్టారు. 3 వేల మంది హాజరయ్యారు. సమాఖ్య 449 సంఘాలతో 6123 మంది సభ్యులు, రూ.12 కోట్లు పొదుపులు, రూ.17 కోట్లు అప్పులతో నడుస్తోందని బాధ్యులు తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ మహిళలు ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు. సభలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంవిపి కాలనీ మేనేజర్ రామకృష్ణ, హార్బర్ రోడ్ మేనేజర్ వాసు, కొత్తరోడ్డు మేనేజర్ రామ్మోహన్ పాల్గొన్నారు. బ్యాంకు రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంగవేణి, లక్ష్మి తదితరులు మాట్లాడారు. సమాఖ్య కో - ఆర్డినేటర్ ధనలక్ష్మి సమాఖ్య ప్రగతి, ప్రణాళికను వివరించారు. రీజనల్ కో-ఆర్డినేటరు కె.శైలజ, ప్రోగ్రాం లీడర్ రమాప్రభ ధాన్ ఫౌండేషన్ సేవలను తెలియజేశారు. దివ్య, శాంతి కుమారి, శివకుమారి, నారాయణమ్మ, కృష్ణవేణి, నళిని హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో లోపాలు సరిచేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితాలో లోపాలను సరిచేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టరల్ ఆఫీసర్‌కు పలు ఆధారాలతో లేఖ రాశారు. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నవంబర్ 23న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరకరమైన అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. అర్హత లేకపోయినా అనేకమంది పేర్లు ఈ జాబితాలో ఉన్నాయని తెలిపారు. మూడో తరగతి, ఐదో తరగతి, టెన్త్, ఇంటర్, డిప్లొమో చదివిన వారు, ఆఖరికి నిరక్షరాస్యుల పేర్లు కూడా అందులో ఉన్నాయన్నారు. ఏ బూత్‌లో, ఏ సీరియల్ నెంబర్‌లో అనర్హుల పేర్లు నమోదయ్యాయో వివరించారు. ఒక్క విశాఖ జిల్లాలోనే 2163 మంది ఇటువంటి తప్పుడు పేర్లు ఉన్న జాబితాను ఎలక్టరల్ ఆఫీసర్‌కు పంపించామన్నారు. అనేక మంది పేర్లను రెండు, అంతకంటే ఎక్కువ సార్లు జాబితాలో పొందుపరిచారన్నారు. బూత్ నెంబర్ 220లో హారిక వెన్నెల అనే వ్యక్తి పేరు వరుస సంఖ్య 125, 126, 127లలో నమోదు కావడం విడ్డూరంగా ఉందన్నారు. అది కూడా చదువు ఇంటర్మీడియట్ అని చూపారన్నారు. ఇటువంటి పేర్లు అనేకం జాబితాలో పలుమార్లు ఉన్నాయని చెప్పారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఇటువంటి తప్పుడు పేర్ల జాబితా 8486తో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీన్ని బట్టి లోపాల తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన సంవత్సరాన్ని ఓటర్ల జాబితాలో చూపలేదన్నారు. 2019 అక్టోబర్ 31 తరువాత డిగ్రీ పూర్తి చేసిన అనేక మంది పేర్లు జాబితాలో పొందుపరిచారని, ఇది పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఇటువంటి వారంతా అనర్హులన్నారు. ఇదే సందర్భంలో భౌతికంగానూ, ఆన్‌లైన్ ద్వారానూ ఫార్మ్ 18 ద్వారా అప్లికేషన్లు ఇచ్చిన అనేక మంది పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు కాలేదన్నారు. ఇటువంటి అనేక అవకతవకల ఓటర్ల జాబితా తయారీ జరగడానికి ప్రధాన కారణం గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ దుర్వినియోగపరచడమేనన్నారు. సిబ్బందికి వ్యక్తిగత లక్ష్యాలు నిర్దేశించి ఉద్దేశపూర్వకంగానే రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులను కూడా ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందని ఆరోపించారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల అసిస్టెంట్ ఎలక్టరల్ అధికారులు కూడా ఇందులో భాగస్వాములు అయ్యారన్నారు. అందువల్ల దీనిపై సమగ్ర విచారణ జరిపి, ఈ అవకతవకలను సరిచేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే సీనియర్ ఐఎఎస్ అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లాలో ఈ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవకతవకలను సరి చేసే చర్యలు చేపట్టాలని కోరారు.